AP 4PG 25 - 2- 2026 wednesday qxp_Layout 1 25-02-2026 06:56 AM Page 2



## ఆప్తుల్లా ముందుకు వచ్చిన సేవా సంస్థ



యాడికి, ఫిబ్రవరి 24 (అనంత ప్రభ)

యాడికి మండలం వెంగన్నపల్లి గ్రామానికి చెందిన గుత్తి సూర్యనారాయణ రెడ్డి (70) ఛాతి నొప్పితో మృతి చెందారు. ఇతని కుమారుడు గతంలోనే మృతి చెందడంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు లేని పరిస్థితి ఏర్పడింది. గ్రామానికి చెందిన నాగముణిరెడ్డి యాడికి మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ సభ్యులకు విషయం తెలియజేయగా వెంటనే స్పందించి వెంగన్నపల్లి గ్రామానికి చేరుకుని గ్రామ సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలను ఫౌండేషన్ వారు పూర్తి చేశారు. నిరాశ్రయులకు ఆప్తుల్లా ముందుకొచ్చి సహాయం చేసినందుకు మృతుడి భార్యతో పాటు గ్రామస్తులు ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు చందగాని ధ్రువ నారాయణ, సాయి వరపు నాగరాజు, కావలి సుధాకర్, బోయ అశోక్, కుమార్ తదితరులు పాల్గొన్నారు

## సజ్జలదిన్నె గ్రామంలో ఫీవర్ సర్వే



యాడికి, ఫిబ్రవరి 24 (అనంత ప్రభ )

జిల్లా మలేరియా అధికారి డి. ఓబులు ఆదేశాల మేరకు చుక్కలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లావణ్య ఆధ్వర్యంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు సజ్జలదిన్నె గ్రామంలో ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇళ్లలో ఉన్న తొట్లలో లార్వా గుర్తించి, వాటిని తొలగించే చర్యలు చేపట్టారు. అలాగే గ్రామ సచివాలయంలో ఏఎన్ఎం సరస్వతి నిర్వహిస్తున్న ఎంఎఫ్ 2 డైరీని పరిశీలించారు. ఎంపీహెచ్ఏ నారాయణస్వామి ఎం ఎఫ్ 2 డైరీ పరిశీలించి గ్రామంలో జ్వరంతో బాధపడుతున్న ప్రతి వ్యక్తికి రక్త పూతలు తీసి వాటిని చుక్కలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపాలని సూచించారు. గ్రామ ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడంతో పాటు ఫ్రైడే డ్రైడే కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించారు.

ఈ కార్యక్రమంలో మేల్ సూపర్వైజర్ నారాయణ, మేల్ హెల్త్ అసిస్టెంట్ నారాయణస్వామి, ఎంఎల్హెచ్పీ ఉమాదేవి, ఏఎన్ఎం సరస్వతి, ఆశా కార్యకర్తలు వన్నూరమ్మ, రామాంజనేయమ్మ తదితరులు పాల్గొన్నారు

## 1255 ఎకరాల మాన్యం ఉన్న స్వామి ఉత్సవాలకు భిక్షాటన అవసరమా -- జేసీ ప్రభాకర్ రెడ్డి ఆవేదన



యాడికి, ఫిబ్రవరి 24 (అనంత ప్రభ)

యాడికి మండల కేంద్రంలోని శ్రీ శివ లక్ష్మీ చెన్నకేశవ స్వామికి 1255 ఎకరాల మాన్యం ఉన్నప్పటికీ ప్రతి ఏడాది బ్రహ్మోత్సవాలకు ప్రజల వద్ద చందాలు అడగడం బాధాకరమని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1255 ఎకరాల భూమి ఉన్న శ్రీమంతునికి ప్రతి సంవత్సరం ఉత్సవాలకు భిక్షాటన చేయడం సరికాదు. స్వామివారి భూములను అన్యాక్రాంతం చేసుకున్న వారినుంచి భూములు తిరిగి దేవ-స్థానానికి చెందేలా చేస్తాను. స్వామివారి భూముల్లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన వారిని కూడా వదిలిపెట్టను అని స్పష్టం చేశారు. ఈసారి బ్రహ్మోత్సవాలకు ప్రజల వద్దకు వెళ్లి చందాలు అడగవద్దని సూచిస్తూ, 8 లక్షల రూపాయలను దేవస్థానం కమిటీ సభ్యులకు మరియు గ్రామ పెద్దలకు స్వయంగా అందజేశారు. అవసరమైన సహాయాన్ని మరింతగా అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల అనంతరం రాజకీయాలకు అతీతంగా సమావేశం ఏర్పాటు చేసి స్వామివారి భూముల అంశంపై చర్చించనున్నట్లు తెలిపారు. దేవాదాయ శాఖ అధికారులు కూడా స్పందించి భూముల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా యాడికిలో అన్యాక్రాంతం అయిన స్వామి వారి భూములు, స్థలాలపై ఉత్సవాల అనంతరం జేసీ ప్రభాకర్ రెడ్డి తీసుకునే చర్యలపై గ్రామ ప్రజల్లో చర్చ జరుగుతోంది

## మైనింగ్ ప్రభావిత గ్రామాల సమస్యలపై మంత్రిని కలిసిన ఆది గుడిసె కిష్టమ్మ



ఆదోని , ఫిబ్రవరి 24 (అనంత ప్రభ)

ఈ రోజు సచివాలయంలో మైనింగ్, భూగర్భ శాస్త్ర & ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర కార్యాలయంలో కర్నూలు జిల్లా ఇన్చార్జి ఆది గుడిసె కిష్టమ్మ, ఆలూరు నియోజకవర్గం ఇంచార్జి వైకుంఠం జ్యోతి మర్యాదపూర్వకంగా కలిశారు.

జిల్లాలో మైనింగ్ కార్యకలాపాల కారణంగా ప్రభావితమవుతున్న గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, రహదారుల దుస్థితి, తాగునీటి కొరత, పర్యావరణ కాలుష్యం, జీవనోపాధిపై పడుతున్న ప్రభావం వంటి అంశాలను మంత్రికి వివరించారు. అదేవిధంగా ఎక్సైజ్ శాఖకు సంబంధించిన స్థానిక సమస్యలు, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న అంశాలపై కూడా చర్చించారు.

ఈ సందర్భంగా మంత్రి సమస్యలను సమగ్రంగా పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మైనింగ్ ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలని నాయకులు కోరారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ భేటీతో జిల్లాకు సంబంధించిన కీలక సమస్యలు పరిష్కారం దిశగా ముందుకు సాగుతాయని ఆశాభావం వ్యక్తమైంది

## యాడికిలో కబడ్డీ పోటీలు ఘనంగా ప్రారంభం



యాడికి, ఫిబ్రవరి 24 (అనంత ప్రభ)

యాడికి మండల కేంద్రంలో జరుగుతున్న శ్రీ శివ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కబడ్డీ పోటీలను మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ క్రీడా పోటీలకు ముఖ్య అతిథిగా యాడికి సిఐ శ్రీనివాసులు పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, అతిథులు మాట్లాడుతూ యువత శారీరకంగా దృఢంగా ఉండేందుకు క్రీడలు ఎంతో అవసరమని, కబడ్డీ వంటి సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలని సూచించారు. ఈ పోటీలు గ్రామీణ యువతకు మంచి వేదికగా నిలుస్తాయని తెలిపారు. క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభను చాటారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరుగుతున్న ఈ క్రీడా కార్యక్రమాలు గ్రామంలో పండుగ వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చాయి. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, టిడిపి మండల కన్వీనర్ దడియాల ఆది, టిడిపి సీనియర్ నాయకులు గొర్తి రుద్రమ నాయుడు, విశ్వనాథ్, గుండా నారాయణస్వామి, తిరంపురం నీలకంఠ, జనసేన మండల కన్వీనర్ సునీల్, బిజెపి మండల కన్వీనర్ వద్ది రాజశేఖర్ పలువురు పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు


## శ్రీ వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో కోలాటం ఆడిన ఎంపీ



శింగనమల, ఫిబ్రవరి 23 (అనంత ప్రభ)

శింగనమల మండలం పెరవలి గ్రామంలో సోమవారం శ్రీ వాల్మీకి మహర్షి వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. మండపంలో తొలుత అర్చకులు గణపతి పూజ, రక్షాంధనం, పంచగవ్యం, మండప పూజ, యంత్రాభిషేకం, జలాధివాసం, యంత్ర విగ్రహస్థాపన, కార్యక్రమాలు నిర్వహించారు. తర్వాత వేద మంత్రాల నడుమ విగ్రహాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. కార్యక్రమానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ముఖ్య అథితిగా హాజరై పూజలు చేశారు. తర్వాత వారు మాట్లాడుతూ.. శ్రీరాముని చరితను ప్రపంచానికి పరిచయం చేసిన వాల్మీకి మహర్షి అన్ని యుగాల్లో పూజ్యనీయుడని అన్నారు. చెడు నుంచి మంచికి మారి మహర్షి అయ్యారని తెలిపారు. ప్రతిఒక్కరూ ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.

## వేడుకాపురం (యాడికి )లో మొదలైన బ్రహ్మోత్సవ వేడుకలు



యాడికి, ఫిబ్రవరి 24 (అనంత ప్రభ)

వేడుకాపురం (యాడికి) లో శ్రీ శివ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి బ్రహ్మోత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ బ్రహ్మోత్సవాలను తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు పుష్ప విమాన వాహన సేవ, 26వ తేదీన సింహ వాహన సేవ, 27న శేష వాహన సేవ, 28న హనుమద్ వాహన సేవ, మార్చి 1న గరుడ వాహన సేవ, 2న గజవాహన సేవ, 3న స్వామి వారి కళ్యాణం, రథోత్సవం, 4న అశ్వ వాహన సేవ, 5న హంస వాహన సేవ, 6న శ-యనోత్సవ సేవ కార్యక్రమాలు జరగనున్నట్లు ఆలయ కమిటీ మరియు గ్రామ పెద్దలు తెలిపారు. ఈ ఉత్సవాలకు యాడికి మండలంతో పాటు చుట్టుపక్కల మండలాలు మరియు ధర్మవరం తదితర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉందని తెలిపారు. కావున గ్రామ ప్రజలందరూ ఉత్సవాల నిర్వహణకు సహకరించాలని కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. జేసీ ఫ్యామిలీ ఆధ్వర్యంలో స్వామివారి వాహన సేవలతో పాటు వివిధ క్రీడా మరియు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నేడు ఓపెన్ కబడ్డీ పోటీలు, 26న రాతి గుండు ఎత్తు పోటీలు, 27న ఇరుసు ఎత్తు పోటీలు, 28న కర్రసాము పోటీలు, మార్చి 4న రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నారు. అలాగే డాన్స్ కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశారు. ఈ బ్రహ్మోత్సవాలు ఉమ్మడి అనంతపురం జిల్లాలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన దేవోత్సవంగా పేరు పొందినట్లు పెద్దలు తెలిపారు

## ఆదోని బావాజీ పేట 2వ వార్డులో డ్రైనేజ్ పనులకు శ్రీకారం



ఆదోని , ఫిబ్రవరి 24 (అనంత ప్రభ)

ఆదోని పట్టణంలోని బావాజీ పేట రెండో వార్డులో ఎమ్మెల్యే డాక్టర్ వాల్మీకి పార్థసారథి ఆదేశాల మేరకు రూ. 8 లక్షల అంచనా వ్యయంతో కొత్త డ్రైనేజ్ నిర్మాణ పనులకు పూజా కార్యక్రమంతో శ్రీకారం చుట్టారు. స్థానిక ప్రజల దీర్ఘకాల సమస్యగా ఉన్న మురుగునీటి నిల్వ సమస్యకు పరిష్కారం లభించనుండటంతో వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ లోకేశ్వరి, మున్సిపల్ కమిషనర్ నయం, ఏఈ, డీఈ అధికారులు, కాంట్రాక్టర్ రఘు, వార్డ్ కౌన్సిలర్ ఏవి సురేష్, కర్నూలు జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు, నాయకులు ముని, పట్టణ నార్త్ ఉపాధ్యక్షుడు వాల్మీకి మహాదేవ్, కూటమి టీడీపీ--జనసేన నాయకులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

డ్రైనేజ్ నిర్మాణం పూర్తయితే ప్రాంతంలో పరిశుభ్రత మెరుగుపడటంతో పాటు వర్షాకాలంలో మురుగునీటి ఇబ్బందులు తగ్గుతాయని అధికారులు తెలిపారు. స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులు కొనసాగిస్తామని ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు

## 'ప్రభుత్వ నిర్లక్ష్యం... భవిష్యత్తులో జిల్లా సాధిస్తాం'



ఆదోని , ఫిబ్రవరి 24 (అనంత ప్రభ)

101 రోజులుగా సాగుతున్న ఆదోని జిల్లా సాధన దీక్షలకు కూటమి ప్రభుత్వం స్పందించకపోవడంపై అసంతృప్తి వ్యక్తవ-ంవుతోంది. ప్రజల ఆకాంక్షలను పట్టించుకోకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఉద్యమ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం దీక్షా శిబిరాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి జేఏసీ సభ్యులకు సంఘీభావం ప్రకటించారు.

ఇప్పటికే 100 రోజులు గడిచినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టమైన హామీ రాకపోవడం బాధాకరమని ఆయన అన్నారు. ప్రజల ఆత్మగౌరవానికి సంబంధించిన ఈ డిమాండ్‌ను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేదంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రశాంతంగా సాగుతున్న ఈ నిరసనను ప్రభుత్వం గౌరవించాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు.

ఆదోని జిల్లా కోసం ప్రజలు ఏకమై పోరాడుతున్నారని, రాబోయే రోజుల్లో ఈ ఉద్యమం మరింత విస్తరించి రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమవుతుందని నాయకులు తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఆదోని జిల్లాను ప్రకటించే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు

## బాల్య వివాహాలతో భవిష్యత్ అంధకారం



కూడేరు, ఫిబ్రవరి 24 (అనంత ప్రభ)

కూడేరు మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామపంచాయతీలో ఐ సి డి ఎస్ సూపర్వైజర్ సురేఖ వారి సిబ్బందితో కలిసి మంగళవారం రోజున విద్యార్థినిలకు బాల్య వివాహాల నియంత్రణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ మాట్లాడుతూ చిన్న వయ-సులోని పెళ్లి చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో అనేక అనర్థాలకు దారితీస్తుందని ఆమె వివరించారు. అలాగే పిల్లలు యొక్క తల్లిదండ్రులకు చిన్న వయసులో తొందరపడి పెళ్లిళ్లు చేయడం ద్వారా ఎలాంటి సమస్యలు ఎదురవుతాయనే వాటిని గురించి క్షుణ్ణంగా వివరించారు. చిన్నపిల్లలు భవిష్యత్తు లక్ష్యంగా అంగన్వాడి కార్యకర్తలు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా బాల్య వివాహాలు అరికట్టేందుకు సమిష్టిక కృషి చేయాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ మండల సూపర్ వైజర్ సురేఖ, మహిళా సంరక్షరాలు గాయత్రి, అంగన్వాడీ టీచర్ రామాంజనమ్మ , ఆశాలు పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు


## తిమ్మాపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం



కూడేరు, ఫిబ్రవరి 24 (అనంత ప్రభ)

కూడేరు మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామపంచాయతీలో రైతు సేవా కేంద్రం నందు మండల వ్యవసాయ అధికారి జి. శుభకర్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రబి పంటల సాగులో తీసుకోవలసిన మెలకువలు గురించి అవగాహన కల్పించారు. అలాగే రైతులు తప్పనిసరిగా (ఫార్మర్ రిజిస్ట్రేషన్ )చేయించుకోవాలని తద్వారా ప్రభుత్వ పథకాలు రాయితీలు సకాలంలో పొందే అవకాశం ఉంటుందని సూచించారు. పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులు అందుతున్న ఆర్థిక సహాయం అర్హతలు నమోదు విధానం గురించి కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు సిబ్బంది మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు

## శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆలయ కమిటీ



ఆత్మకూరు, ఫిబ్రవరి 24 (అనంత ప్రభ)

ఆత్మకూరు మండలం పంపునూరు గ్రామంలో వచ్చినటువంటి ప్రసిద్ధిగాంచిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి మంగళవారం సంధర్భంగా స్వామి వారికి పాలాభిషేకం పంచామృత అభిషేకం, అలంకరణ,ఆకుపూజ ,అర్చన మహానైవేద్యం , మహామంగళహారతి, పల్లకి సేవ మరియు రాహు కాలం పూజలో భాగంగా కుజదోష కాలసర్పదోష సర్పదోష నివారణ కొరకు "శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మూల మంత్ర బీజాక్షర హోమము" నిర్వహించడమైనది. భక్తులు స్వామివారి అభిషేకం మరియు హోమము నందు పాల్గొన్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి బి. బాబు, ఆలయ కమిటీ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, ఆలయ పాలకమండలి తెలియజేశారు.

## ఏపీ స్టేట్ లెజిస్లేటివ్ స్పోర్ట్స్ మీట్ 2026 క్రీడల్లో అద్భుతంగా రాణించిన పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి



అనంతపురం, ఫిబ్రవరి 24 (అనంత ప్రభ)

ఏపీ స్టేట్ లెజిస్లేటివ్ స్పోర్ట్ మీట్ 2026 లో ఎమ్మెల్యే ఎమ్మెల్సీలకు మూడు రోజులు పాటు విజయవాడ వేదికగా ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో మంగళవారం సాయంత్రం మహిళా ఎమ్మెల్యేలకు నిర్వహించిన క్రీడల పోటీల్లో పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే సింధూర రెడ్డి అద్భుతంగా రాణించారు. పరుగు పందెంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తో పాటు మిగతా మహిళా ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలతో నిర్వహించిన వారిలో గ్రీష్మ ,శ్రావణి ,భూమా అఖిలప్రియలు పోటీపడ్డారు. ఈ పరుగు పందెంలో మొదటి స్థానం మహిళా ఎమ్మెల్సీ గ్రీష్మ ,రెండవ స్థానంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి నిలిచారు.

టగ్ ఆఫ్ వార్ క్రీడలో డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు నాయకత్వంలో ఆడిన ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీల జట్టు విజయం సాధించింది. ఈ విజయం సాధించిన క్రీడా జట్టులో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కూడా ఉన్నారు